సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లండి

- గృహ సారథులు, కన్వీనర్లదే ఆ బాధ్యత
- వైఎస్సార్‌సీపీ తూర్పు పరిశీలకుడు సూర్యనారాయణరాజు



ఎంవీపీ కాలనీలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న అక్కరమాని విజయనిర్మల



చిల్డ్రన్స్ ఎరీనాలో జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న వైఎస్సార్‌సీపీ తూర్పు పరిశీలకుడు సూర్యనారాయణరాజు, సమన్వయకర్త విజయనిర్మల, తదితరులు

బీచ్ రోడ్డు: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు ప్రజల్లోకి తీసుకెళ్లాలని వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు సూర్యనారాయణరాజు సూచించారు. వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్స్ ఎరీనాలో తూర్పు నియోజకవర్గ పరిధిలోని 17, 19, 20, 21, 28 వార్డులకు చెందిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సూర్యనారాయణరాజు మాట్లాడుతూ ప్రభుత్వ పథకాలను వలంటీర్లు ఇంటికి వెళ్లి అందిస్తే.. ఆ లబ్ధిదారులను పార్టీ వైపునకు మళ్లేలా గృహ సారథులు కృషి చేయాలన్నారు. గతంలో ఏ ప్రభుత్వం కూడా పేదల కోసం ఆలోచించలేదని, ప్రస్తుతం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదల అభ్యున్నతి కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టారని తెలిపారు. పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమానికి వెళ్తున్నప్పుడు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందన్నారు. అయితే పథకాలపై కొంత మంది అవగాహన లేక ఇబ్బంది పడుతున్నారని, అటువంటి వారికి గృహ సారథులు, కన్వీనర్లు సహకరించి, సమస్యలు పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అర్హులందరికీ ప్రభుత్వ పథకాలు అందేలా సచివాలయ సిబ్బందితో సమన్వయం చేసుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేస్తే 2024లో వైఎస్సార్‌సీపీ ఘన విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో తూర్పు నియోజకవర్గంలోని కార్పొరేటర్లు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

పేదల అభ్యున్నతే లక్ష్యం: అక్కరమాని

ఎంవీపీ కాలనీ: పేద, మధ్య తరగతి ప్రజల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పథకాలను అమలు చేస్తున్నట్లు వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల తెలిపారు. వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ పరిశీలకుడు సూర్యనారాయణరాజుతో కలిసి ఎంవీపీ కాలనీ అప్పుఘర్‌లో మంగళవారం 9, 18 వార్డులకు చెందిన గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కరమాని మాట్లాడుతూ ప్రజా సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం విస్తృతంగా కృషి చేస్తోందన్నారు. ఇందుకు రూ.వేల కోట్లు నిధులను ఖర్చు చేస్తున్నట్టు చెప్పారు. పథకాల ద్వారా ప్రతి ఇంటికి సంక్షేమ ఫలాలు అందేలా చర్యలు తీసుకున్నారన్నారు. ఈ లబ్ధిని వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ కన్వీనర్లు విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని సూచించారు. సంక్షేమంతో పాటు ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులను ప్రజలకు వివరించాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు ఉమ్మిడి స్వాతి, మువ్వల లక్ష్మి, 18వ వార్డు ఇన్‌చార్జి పుక్కళ్ల ధనలక్ష్మి, పుక్కళ్ల శంకర్, మువ్వల సురేష్ తదితరులు పాల్గొన్నారు.



హాజరైన 9, 18 వార్డుల సచివాలయ కన్వీనర్లు, గృహ సారథులు, వలంటీర్లు

ఘనంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు

ఏయూ క్యాంపస్: పెదవాల్తేరులోని శ్రీఅసంగానంద ఆశ్రమంలో పునర్నిర్మించిన మృత్యుంజయేశ్వర ఆలయ ప్రారంభోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. మూడు రోజుల పాటు జరిగే శ్రీశివలింగ నందీశ్వర, ధ్వజ స్తంభ శిఖర కలశ ప్రతిష్టా కార్యక్రమాలు మంగళవారం ఉదయం గణపతి పూజతో ప్రారంభమయ్యాయి.

పుణ్యాహవచనం, రుత్విక్‌వరణం, యాగశాల ప్రవేశం, మండప దేవతా ఆవాహన, హోమాలు, మహానైవేద్యం, శివ, నంది, ధ్వజ స్తంభ యంత్రములకు సుగంధ ద్రవ్యములతో జలాధివాసం జరిపారు. బుధవారం సౌభాగ్యలక్ష్మి కుంకుమ పూజ, విగ్రహ మూర్తులకు, ప్రతిష్టా యంత్రములకు భక్తులతో పంచామృతాషేకం నిర్వహించనున్నారు. సాయంత్రం ధాన్యాధివాసం, పుష్పాధివాసం, శయ్యాధివాసం, అష్టకలశ స్థాపన చేయనున్నారు.



ప్రతిష్ఠాపన పూజలు చేస్తున్న అర్చకులు

9న ప్రతిష్టా కార్యక్రమం

విష్ణు సేవానందగిరి స్వామి ప్రత్యక్ష పర్యవేక్షణలో గురువారం ఉదయం 8.47 గంటలకు విగ్రహ ప్రతిష్టా కార్యక్రమం జరగనుంది. జగద్గురు మఠం, శ్రీలలితాంబిక పీఠాధిపతి సంపూర్ణానందగిరి స్వామి చేతుల మీదుగా ఈ కార్యక్రమం నిర్వహించనున్నారు.

రోబోటిక్స్‌లో ఏయూ విద్యార్థుల ప్రతిభ

ఏయూ క్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం ఆంగ్ల మాధ్యమం పాఠశాల విద్యార్థులు రోబోటిక్స్ రంగంలో ప్రతిభ కనబరుస్తున్నారు. పూణేలో మార్చి 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహించనున్న ఫస్ట్ టెక్ చాలెంజ్(ఎఫ్‌టీసీ)కి ఏయూ పాఠశాల విద్యార్థులు 11 మంది ఎంపికయ్యారు. వీరికి మూడు ల్యాప్‌టాప్‌లను మాజీ ఎమ్మెల్యే ఎస్.ఎ.రెహమాన్, శిరీన్ దంపతులు బహూకరించారు. వీటిని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్.ఎ.రెహమాన్ మాట్లాడుతూ తన కుమారుడు సమీర్, మనవడు బుధిల్ ఏయూ విద్యార్థులను రోబోటిక్ రంగంలో నిష్ణాతులుగా తీర్చిదిద్దే ప్రయత్నం చేస్తున్నారన్నారు. వారి సహకారంతో విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించామన్నారు. శిరీన్ రెహమాన్ మాట్లాడుతూ భవిష్యత్ అంతా రోబోటిక్ రంగానిదేనని, ఆ దిశగా విద్యార్థులను ప్రోత్సహించే ప్రయత్నం చేస్తున్నామన్నారు. ఏయూ వీసీ ప్రసాదరెడ్డి మాట్లాడుతూ తమ పాఠశాల విద్యార్థులను ఎంపిక చేసి, వారికి ఆన్‌లైన్ విధానంలో శిక్షణ అందిస్తూ రోబోటిక్ రంగంలో జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యేలా ఎస్.ఎ.రెహమాన్ కుటుంబ సభ్యులు అందిస్తున్న సహకారం స్ఫూర్తిని ఇస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ జి.సుధారాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి, ఎస్.ఎ.రహమాన్, తదితరులు

క్లుప్తంగా

'ముడసర్లోవ భూములు ప్రైవేటీకరించొద్దు'



పోస్టరు ఆవిష్కరిస్తున్న సీపీఎం ఆరిలోవ జోన్ నాయకులు

ఆరిలోవ: ముడసర్లోవ భూములు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సీపీఎం ఆరిలోవ జోన్ నాయకులు సీఐటీయూ కార్యాలయంలో మంగళవారం పోస్టరు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జోన్ కార్యదర్శి నరేంద్రకుమార్ మాట్లాడుతూ జీవీఎంసీ అధికారుల చర్యలను ఖండించారు. ప్రభుత్వ భూములు ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించడం అన్యాయమన్నారు. దీనిపై సీపీఎం పోరాటం చేయడానికి సిద్ధంగా ఉందన్నారు. ముడసరోలవ భూముల ప్రాధాన్యత, అక్కడ పచ్చదనం, ప్రకృతి అందాల గురించి ప్రజలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు పి.శంకరరావు, వి.కృష్ణమూర్తి, బి.సూర్యమణి, ఎస్.రంగమ్మ పాల్గొన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన



భూమి పూజ చేస్తున్న వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ అక్కరమాని విజయనిర్మల

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డులో పలు అభివృద్ధి పనులకు వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్, వైఎస్సార్ సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త అక్కరమాని విజయనిర్మల శంకుస్థాపన చేశారు. డాక్టర్స్ కాలనీ ప్రశాంతి నగర్ నుంచి చిన్న పోలమ్మ గుడి వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, సీసీ రోడ్ల మరమ్మతులను దాదాపు రూ.15 లక్షల వ్యయంతో చేపడుతున్నారు. ఈ పనులను మంగళవారం ఉదయం ఆమె శ్రీకారం చుట్టారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ మువ్వల లక్ష్మి, పార్టీ నాయకులు మువ్వల సురేష్, దువ్వి నాగరాజు, హేమలత, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై తెగిపడిన విద్యుత్ తీగ



విద్యుత్ తీగ తెగిపడిన దృశ్యం

ఎంవీపీ కాలనీ: జీవీఎంసీ 18వ వార్డు లెబెన్‌హిల్స్ స్కూల్ సమీపంలో విద్యుత్ తీగ తెగిపడడం కలకలం రేపింది. నిత్యం రాకపోకలతో రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో విద్యుత్ తీగ తెగి పడడంతో వాహనచోదకులు ఆందోళనకు గురయ్యారు. విద్యుత్ తీగ ఒక వాహనంపై పడినప్పటికీ ఎవరికీ ఎలాంటి ప్రమాదం జరగలేదు. రద్దీగా ఉండే ఈ ప్రాంతంలో విద్యుత్ తీగ తెగి పడటాన్ని గుర్తించిన స్థానికులు వాహనదారులను అప్రమత్తం చేశారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకుడు ఉమ్మిడి కల్యాణ్ విద్యుత్ శాఖ అధికారులకు సమాచారం ఇవ్వడంతో అప్రమత్తమయ్యారు. ఆ ప్రాంతంలో విద్యుత్ సరఫరాను నిలిపివేసి పరిస్థితిని చక్కదిద్దారు. దీంతో అందరూ ఊపిరిపీల్చుకున్నారు.

నేడు ఆతిథ్య పరిశ్రమపై సదస్సు

మురళీనగర్: నగరంలోని గ్రాండ్ స్పేస్ ఎలిజెంట్ హోటల్‌లో బుధవారం హాస్పిటాలిటీ ఇండస్ట్రీ – అకాడమియా కాన్‌క్లేవ్ సదస్సు నిర్వహించనున్నట్లు కంచరపాలెం ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.వెంకటరమణ చెప్పారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ సి.నాగరాణి ముఖ్య అతిథిగా పాల్గొని ఆతిథ్య పరిశ్రమ ప్రాధాన్యత, యువతకు ఉపాధి అవకాశాల కల్పనపై పలువురు హోటల్ మేనేజ్‌మెంటు సంస్థలు, స్టార్ హోటల్స్ ప్రతినిధులతో చర్చిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఫుడ్ క్రాఫ్ట్ ఇన్‌స్టిట్యూట్, హెచ్ఆర్ ఏఏపీ సంయుక్తంగా ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు.

విద్యార్థుల్లో సృజనాత్మకతకు కృషి



యూత్ ఫర్ సేవా పోస్టర్ ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ విజయబాబు, అధ్యాపకులు

మద్దిలపాలెం : విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు కృషి చేయాలని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఐ.విజయబాబు సూచించారు. కళాశాలలో యూత్ ఫర్ సేవా కార్యక్రమంలో భాగంగా చిగురు కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల్లో దాగి ఉన్న కళలు, క్రీడలు, వైవిధ్య ప్రతిభ నైపుణ్యాలను వెలికి తీయడానికి చిగురు పేరిట పలు పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ, ఎన్ఎస్ఎస్ అధికారులు పోలా ఉమామహేశ్వరరావు, వి.రత్నభారతి, వి.సుధీర్, శామ్యూల్ డేవిడ్‌రాజ్, యూత్ ఫర్ సేవా ప్రతినిధులు పాల్గొన్నారు.

ఉపాధి సృష్టించే స్థాయికి విద్యార్థులు ఎదగాలి

ఆర్ట్స్ కళాశాల విద్యార్థుల స్వాగత సభలో ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూ క్యాంపస్: ఉపాధి అవకాశాలను సృష్టించే స్థాయికి ఆంధ్ర విశ్వవిద్యాలయం విద్యార్థులు ఎదగాలని వర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి ఆకాంక్షించారు. మంగళవారం ఏయూ కన్వెన్షన్ సెంటర్‌లో ఏయూ ఆర్ట్స్, కామర్స్ కళాశాల విద్యార్థులకు నిర్వహించిన స్వాగత సభలో ఆయన మాట్లాడారు. విద్యార్థులు ఉపాధి కోసం ఎదురు చూడకుండా అవకాశాలను సృష్టించే ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా, ఆవిష్కర్తలుగా ఎదగాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోరుకుంటున్నారన్నారు. దీనికి అవసరమైన వ్యవస్థను విశ్వవిద్యాలయంలో పూర్తిస్థాయిలో అభివృద్ధి చేశామన్నారు. క్రమ శిక్షణకు వర్సిటీ అత్యధిక ప్రాధాన్యం ఇస్తుందన్నారు. గత రెండు సంవత్సరాలుగా ప్లేస్‌మెంట్ సంఖ్య పెరగడం, విద్యార్థులు అధిక వేతనాలతో ఉద్యోగాలను సాధించడం చూస్తున్నామన్నారు. ఆర్ట్స్ కళాశాలకు పునరుజ్జీవనం, పూర్వ వైభవం తీసుకొస్తామన్నారు. కళాశాల పరిధిలో 97 శాతానికి పైగా సీట్లు భర్తీ కావడం దీనికి నిదర్శనమన్నారు. వర్సిటీ క్యాంపస్‌లో ఆరు విధాలైన స్టార్టప్ ఎకోసిస్టంలను అభివృద్ధి చేసిన విధానాన్ని వివరించారు. 21 శతాబ్దపు నైపుణ్యాలను యువతలో పెంచేలా ప్రత్యేకంగా నైపుణ్య కేంద్రాలను ప్రారంభిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్స్, కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, ఏపీ ఎస్ఈ ప్రిన్సిపాల్ ఆచార్య టి.శోభశ్రీ, విభాగాధిపతులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న వీసీ ప్రసాదరెడ్డి

యూనియన్ బ్యాంకు రుణమేళాకు విశేష స్పందన

ఆరిలోవ: జీవీఎంసీ 10వ వార్డు ఆదర్శనగర్‌లోని యూనియన్ బ్యాంక్‌లో మంగళవారం నిర్వహించిన రుణమేళాకు విశేష స్పందన లభించింది. ముఖ్య అతిథిగా యూనియన్ బ్యాంక్ డిప్యూటీ రీజనల్ అధికారి ఐ.ఎస్.ఎస్.మూర్తి పాల్గొని 28 మంది లబ్ధిదారులకు రూ.5 కోట్లు రుణం మంజూరు చేసి వాటికి సంబంధించిన పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యూనియన్ బ్యాంక్ నుంచి అతి తక్కువ వడ్డీ రేట్లతో గృహ, వివాహ, విద్య, వ్యక్తిగత రుణాలు మంజూరు చేస్తున్నామన్నారు. విదేశీ విద్య కోసం ఎలాంటి హామీ లేకుండా రూ.40 లక్షల వరకు రుణం మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఎం రామారావు, సిబ్బంది కె.శ్రీహరి, పి.ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

12 లీగల్ గార్డియన్‌షిప్ సర్టిఫికెట్ల మంజూరు

మహారాణిపేట: లోకల్ లెవెల్ కమిటీ చైర్మన్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధ్యక్షతన మంగళవారం కలెక్టర్ చాంబర్‌లో సమావేశం జరిగింది. లీగల్ గార్డియన్‌షిప్‌కు సంబంధించి అంశాలు, ఆరోగ్య బీమా పథకం అమలు, ప్రణాళికను జిల్లా విభిన్న ప్రతిభావంతులు శాఖ సహాయ సంచాలకురాలు జె.మాధవి వివరించారు. దివ్యాంగులకు లీగల్ గార్డియన్‌షిప్ సర్టిఫికెట్‌ను త్వరితగతిన మంజూరు చేయడానికి, అట్టడుగు స్థాయిలో ప్రభావంతమైన పనితో గరిష్ట స్థాయికి చేరుకోవడానికి సమగ్ర కార్యచరణ ప్రణాళిక రూపొందించామని ఆమె తెలిపారు. లీగల్ గార్డియన్‌షిప్ సర్టిఫికెట్ల కోసం 14 దరఖాస్తులు రాగా.. వాటిలో 12 దరఖాస్తులకు అర్హత ఉన్నాయని గుర్తించి కమిటీ ఆమోదం తెలిపిందన్నారు. త్వరలోనే లీగల్ గార్డియన్‌షిప్ సర్టిఫికెట్లు అందజేస్తామని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ మానసిక ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఎన్.హరికృష్ణ, ఆశాదీప్ అధ్యక్షుడు, వ్యవస్థాపకుడు పి.ఎం.కె.రావు, ది ఎబిలిటి పీపుల్ వ్యవస్థాపకుడు, డైరెక్టర్ దిలీప్ పాత్రో, తదితరులు పాల్గొన్నారు. దివ్యాంగులు సహాయ సహకారం కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన టోల్ ఫ్రీ నంబరు 1800 425 8911లో సంప్రదించవచ్చు.



పలు అంశాలపై చర్చిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, మాధవి

కంటి వైద్యంపై రాష్ట్ర ప్రభుత్వ చొరవ భేష్

మహారాణిపేట: కంటి వైద్యంపై రాష్ట్ర ప్రభుత్వం చూపిస్తున్న చొరవ అభినందనీయమని అసోసియేషన్ ఆఫ్ కమ్యూనిటీ ఆప్తాల్మాలజిస్ట్ ఆఫ్ ఇండియా ప్రధాన కార్యదర్శి డాక్టర్ స్వపన్ సమంత కొనియాడారు. కళ్లను ఎలా కాపాడుకోవాలో అనే అంశంపై అవగాహన కార్యక్రమం మంగళవారం పెదజాలరిపేట అర్బన్ హెల్త్ సెంటర్‌లో జరిగింది. ఈ సందర్భంగా స్వపన్ సమంత మాట్లాడుతూ రాష్ట్రంలో కంటి వైద్యానికి ప్రభుత్వం ఎంతో సహకారం అందిస్తోందన్నారు. వృద్ధులు, విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేసి, అవసరమైన వారికి ఉచితంగా కళ్లద్దాల పంపిణీ, శస్త్ర చికిత్సలు చేస్తున్నారని చెప్పారు. ఆకుకూరలు, పసుపు పండ్లు, గుడ్లు తినాలని అవగాహన కల్పించారు. మధుమేహ వ్యాధిగ్రస్తులు, నెలలు నిండకుండానే జన్మించిన శిశువులు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవాలని అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారి డాక్టర్ ఎంవీవీ మురళీమోహనరావు సూచించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అధ్యాపకులు ఆచార్య వీవీఎల్ నరసింహారావు, గీతం మెడికల్ కాలేజీ సీనియర్ అధ్యాపకులు డాక్టర్ వినోద్ ప్రేమ్‌సింగ్, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న స్వపన్ సమంత

జేఈఈ మెయిన్స్‌లో విశాఖ సత్తా

జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో విశాఖ విద్యార్థులు సత్తా చాటారు. అత్యుత్తమ ప్రతిభ కనబరిచి మంచి పర్సంటైల్ సాధించారు. విశాఖ ఖ్యాతిని చాటి చెప్పారు. ఈ సందర్భంగా ఆయా కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులను అభినందించాయి.

నారాయణ ప్రభంజనం

సీతమ్మధార: జేఈఈ మెయిన్-2023 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారని సంస్థ డీజీఎం హనుమంతరావు, డీన్ జి.రామలింగేశ్వరరావు తెలిపారు. తమ సంస్థ విద్యార్థులు పి.తేజశ్రీ 99.986295, ఎంవీవీ హర్షవర్ధన్ 99.9856388, ఎల్.అనన్య 99.9642468, సీహెచ్ వెంకట యశ్వంత్ 99.9409876, పి.బాలాజీ అభిషేక్ 99.9339384, ఎం.అనుశ్రీ 99.9248252, వి.యశస్వినాయుడు 99.9244526, ఎం.సుభాసివర్మ 99.9231306, ఎస్.మానిషా నాయుడు 99.9071369, పి.సాత్విక 99.9054354 పర్సంటైల్ సాధించినట్లు చెప్పారు. ఈ ఫలితాల్లో 56 మంది విద్యార్థులు 99 పర్సంటైల్ కంటే అధికంగా సాధించారని వెల్లడించారు. విద్యార్థులు, అధ్యాపకులను డీజీఎం, డీన్ అభినందించారు.

తిరుగులేని శశి

తగరపువలస: సంగివలస శశి విద్యార్థులు జేఈఈ మెయిన్ ఫలితాల్లో అత్యధిక పర్సంటైల్ సాధించినట్టు ఆ విద్యా సంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ తెలిపారు. కె.అభిరామ్ 99.89, బి.కావ్య 99.84, పి.సాయిరాం 99.75, ఆర్.సాయినారాయణ 99.61, ఎం.నాగదుర్గా సతీష్ 99.57, కె.సాయికృష్ణ రమేష్ 99.33, డి.వి.వి చైతన్య 99.28, వి.శ్రీసూర్య గుణ్వంత్ 99.14, ఎ.రంజిత్‌కుమార్ 99.14, ఇ.గౌతం ధీరజ్ 99.01 పర్సంటైల్ సాధించారన్నారు. అలాగే 99 పైన 10 మంది, 98 పైన 20 మంది, 97 పైన 33, 96 పైన 41, 95 పైన 48 మంది పర్సంటైల్ సాధించినట్లు చెప్పారు. ప్రతిభ చూపిన విద్యార్థులను వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ, డైరెక్టర్ మేకా క్రాంతి సుధ అభినందించారు.

శ్రీచైతన్య హవా

విశాఖ విద్య: జేఈఈ మెయిన్ ఫలితాల్లో విశాఖ శ్రీ చైతన్య ఐఐటీ అకడామీ విద్యార్థులు సత్తా చాటారు. ఎం.ప్రశాంతి శ్రీజ, ఎస్.అనిరుధ్, ఎస్.సిద్ధార్థ, రహమాన్ షేక్ జమీల్, డి.సాకేత్‌నాయుడు, కె.శ్రీ కార్తిక్, జి.హరిచరిణి, ఆర్.మోహిత్ నాయుడు 99 పైగా పర్సంటైల్ ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కె.వి.రమణ తెలిపారు. విద్యార్థులను సంస్థ డీన్లు ఎన్.రఘుకుమార్, కె.బంగారు బాబు, జె.సత్యనారాయణ, పి. సత్యనారాయణ అభినందించారు. అధ్యాపక, అధ్యాపకేతర బృందాన్ని అభినందించారు.

శ్రీవిశ్వ విజయకేతనం

సీతంపేట: జేఈఈ మెయిన్-2023 ఫలితాల్లో శ్రీ విశ్వ జూనియర్ కళాశాల విద్యార్థులు అత్యధిక పర్సంటైల్ సాధించారు. సీహెచ్.ప్రతీష్ 99.61 పర్సంటైల్, బి.తనూజ 99.33, ఎ.మహర్షి 99.27, బి.కార్తీక్ శశాంక్ 99.25, ఎల్.హేమంత్ 99.25 పర్సంటైల్ సాధించారు. ఐదుగురు విద్యార్థులు 99 పర్సంటైల్ పైగా, 18 మంది విద్యార్థులు 98 పర్సంటైల్ పైగా సాధించినట్లు శ్రీ విశ్వ విద్యా సంస్థల కె.ధర్మరాజు, డైరెక్టర్ పి.సూర్యనారాయణ తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

ఫిట్జీ విద్యార్థుల ప్రతిభ

సీతంపేట: జేఈఈ మెయిన్ ఫలితాల్లో ఫిట్జీ వైజాగ్ సెంటర్ విద్యార్థులు అద్భుత ఫలితాలు సాధించారు. షేక్ ఆవేజ్ మెహతాబ్ 99.96, నితిల్ కవిన్ 99.96, పీలా రత్న హర్ష 99.93, ఆయుష్ మార్తాండ్ బోర్కర్ 99.88, పెండెల హర్షిత్ 99.85, యు.ఎల్.ఎస్.ఎస్.వైభవ్ 99.85, రూపేష్ మల్లిరెడ్డి 99.82, ఆనంద్ సిద్ధార్థ్ 99.32 పర్సంటైల్ సాధించారని సెంటర్ హెడ్ పెండేల మస్తాన్‌రావు తెలిపారు. ఫిట్జీ వైజాగ్ సెంటర్ నుంచి 462 మంది హాజరు కాగా 22 మంది విద్యార్థులు 99 కంటే ఎక్కువ, 106 మంది 95 కంటే ఎక్కువ, 174 మంది 90 కంటే ఎక్కువ పర్సంటైల్ సాధించినట్లు వెల్లడించారు.

సిరుల తల్లికి స్వర్ణ పుష్పార్చన

డాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారికి మంగళవారం స్వర్ణ పుష్పార్చన నిర్వహించారు. ఉదయం 7 నుంచి 8గంటల వరకు జరిపించిన అష్టదళ పద్మారాధనలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ఉదయం 8 నుంచి 11 గంటల వరకు నిర్వహించిన ప్రత్యేక పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష, ట్రస్ట్ బోర్డ్ చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

విడాకులు ఇవ్వకుంటే అడ్డు తొలగించుకుంటా..

వివాహేతర సంబంధం పెట్టుకొని బెదిరిస్తున్నాడని భర్తపై భార్య ఫిర్యాదు

దొండపర్తి(విశాఖ దక్షిణ): మరో మహిళతో వివాహేతర సంబంధం పెట్టుకొని విడాకులు ఇవ్వకపోతే అడ్డు తొలగించుకుంటానని బెదిరిస్తున్నాడని భర్తపై భార్య నగర పోలీస్ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్‌కు ఫిర్యాదు చేసింది. భర్త గండేటి సుదర్శన్‌తో పాటు వివాహేతర సంబంధం సాగిస్తున్న మహిళ కూడా తననే కాకుండా తన పిల్లలను కూడా తీవ్ర దుర్భాషలాడుతూ బెదిరింపులకు పాల్పడిందని ఫిర్యాదులో పేర్కొంది. తనకు న్యాయం చేయాలని సీపీని కోరగా ఆయన విచారణ నిమిత్తం దిశ పోలీసులకు కేసును అప్పగించారు. ఆమె ఫిర్యాదు ప్రకారం.. పాత జైల్ రోడ్డు ప్రాంతానికి చెందిన గండేటి సుదర్శన్‌రావుకు, ఎన్ఏడీ కొత్త రోడ్డుకు చెందిన గండేటి అన్నాకుమారిలకు 2003లో రిజిస్టర్ వివాహం జరిగింది. వీరికి ఒక బాబు, పాప ఉన్నారు. 2007లో సుదర్శన్‌కు కువైట్‌లో ఉద్యోగం రావడంతో వెళ్లిపోయాడు. మధ్యలో వచ్చి రెండు, మూడు నెలలు ఉండి వెళ్లేవాడు. 2020 మార్చిలో అక్కడి నుంచి తిరిగి విశాఖకు వచ్చేశాడు. కొద్ది రోజుల తరువాత సుదర్శన్.. వేరే మహిళతో తరచూ అర్ధరాత్రుళ్లు కూడా మాట్లాడుతుండడాన్ని భార్య అన్నాకుమారి గమనించింది. దీనిపై భర్తను ప్రశ్నించగా.. ఓ మహిళకు ఒక పోలీస్ కేసు విషయంలో సహాయం చేస్తున్నానని చెప్పేవాడు. అయితే భార్యకు అనుమానం వచ్చి అతని వాట్సాప్ చాట్ చూడగా.. అందులో అసభ్యకరమైన మెసేజ్‌లు కనిపించాయి. వాటిపై ప్రశ్నించగా ఆమెను దాబాయించి చేసి మాట దాటించేవాడు. ఫోన్లు, చాటింగ్‌లు మాత్రమే కాకుండా మద్దిలపాలెంలో ఉంటున్న మహిళ ఇంటికి వెళ్లి అక్కడే ఉండడం ప్రారంభించాడు. రాత్రుళ్లు కూడా ఇంటికి రాకపోగా.. భార్య అన్నాకుమారికి ఫోన్ చేసి తమ బంధానికి అడ్డుగా ఉన్నావని, విడాకులు ఇవ్వాలని, లేకపోతే నిన్ను ఎలా తప్పించాలో తెలుసని భార్యను బెదిరించాడు. నెల రోజుల నుంచి ఈ వేధింపులు మరింత ఎక్కువయ్యాగా, శారీరకంగా, మానసికంగా హింస్తున్నాడని, తన భర్త, వివాహేతర సంబంధం సాగిస్తున్న మహిళ నుంచి తనకు, తన పిల్లలకు ప్రాణహాని ఉందని భార్య అన్నాకుమారి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తమకు న్యాయం చేయాలని కోరింది. ఈ ఫిర్యాదుపై దిశ పోలీసులు దర్యాప్తు చేశారు.